క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్ స్టేజీ వద్ద ఉన్న వెంకటేశ్వర్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరయ్యే సమ్మేళనానికి మండలంలోని తాడూరు, తిప్పాపూర్, కొరటికల్, వెల్టూర్ తదితర గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష

కొల్లాపూర్: కేవైఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో కొల్లాపూర్‌లో ఏర్పాటు చేయనున్న పాలిసెట్ ఉచిత శిక్షణకు పదో తరగతి చదివిన విద్యార్థులకు ఆదివారం అర్హత పరీక్ష నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అందుకు గాను విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. బీజేపీ కార్యాలయంతో పాటు, మాధవస్వామి దేవాలయ ఆవరణలో పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు సుధాకర్‌రావుతో పాటు విద్యార్థులు పట్టణంలో ర్యాలీగా వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడారు. భారత రాష్ట్రీయ సమృద్ధి ట్రస్టు సహకారంతో సాయి మేధ కోచింగ్ సెంటర్ ఫ్యాకల్టీతో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అర్హత పరీక్షలో మెరుగైన ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు



వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్ హైస్కూల్ ఆదివారం ఆరో తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆరో తరగతి విద్యార్థులు పరీక్షలు నిర్వహించారు. 435 మంది విద్యార్థులకు 285 మంది విద్యార్థులు మాత్రమే హాజరైనట్లు చెప్పారు. 150 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చెప్పారు. ఏడో తరగతి నుంచి పదో తరగతి ప్రవేశ పరీక్షలకు మొత్తం 447 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు పరీక్ష కొనసాగగా.. 334 మంది విద్యార్థులు హాజరయ్యారు. మిగిలిన 113 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ పుష్పలత పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణలో రాధకృష్ణ, పర్వతాలు, నర్సింహ హాజరయ్యారు.

బాధితులకు న్యాయం చేయాలి



పెంట్లవెల్లి: మణెమ్మ, మల్లయ్య దంపతులకు చెందిన వారి భూమి వారికి ఇప్పించి రెవెన్యూ పోలీస్ శాఖ అధికారులు న్యాయం చేయాలని మాలల చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు మూలె కేశవులు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెంట్లవెల్లి శివారులో నడిపి నాగన్న పట్టా పొలం ఎకరా 20 గుంటలను 2007 సంవత్సరంలో మణెమ్మ కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన మహిళనే ఆ భూమిని శిస్తు చేస్తూ వస్తుందన్నారు. 2022 సంవత్సరం నుంచి అమ్మిన నాగన్న వారసులు దౌర్జన్యంగా పంటపొలంలోకి వచ్చి విత్తనాలు వేసి సాగు చేస్తున్నారన్నారు. న్యాయ అన్యాయాలు పరిశీలించి కోర్టు కూడా పొలం మణెమ్మకు దక్కుతుందని డిగ్రీ ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా చట్టపరంగా రికార్డులు పరిశీలించి, పట్టాపాస్ పుస్తకాలు పరిశీలించి మణెమ్మకు న్యాయం చేయాలని కోరారు.

కేంద్రంలో బీజేపీని గద్దెదించాలి

తాడూరు: కేంద్రంలో బీజేపీ హటావో, దేశ్‌కీ బచావో అనే నినాదంతో సీపీఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా మండల కేంద్రంలో పాదయాత్ర కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ.. ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వెలుగెత్తి పోరాడేలా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలవాలని సీపీఐ నిర్ణయించిందన్నారు. సీపీఐ నాయకులు ఎండీ కుతుబుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్, నాయకులు కురుమయ్య, ఎల్లయ్య, శేకర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

- ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



ముస్లింలకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో ముస్లింలకు రంజాన్ కానుకల అందజేసి మాట్లాడారు. ముస్లిం, మైనార్టీలకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కుల, మతాలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పరిపాలన సాగిస్తున్నారని వివరించారు. ముస్లింల హక్కుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా సాగుతున్నాయన్నారు. తహసీల్దార్ రమేష్‌నాయక్, కౌన్సిలర్లు బడా అనిత యాదవ్, కృష్ణమూర్తి, కోఆప్షన్ సభ్యులు రుక్మద్దీన్, నరేందర్‌రెడ్డి, గాలియాదవ్, రమేష్‌యాదవ్, జంబులయ్య, జాఫర్, ముస్తఫా, విక్రమ్, అహ్మద్‌షరీఫ్, ఖాదర్‌పాష తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్...

ఆదివారం సాయంత్రం మహబూబ్ ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వం తరఫున ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి విందు కార్యక్రమంలో పాల్గొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు భోజనాలు వడ్డించారు. వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లింలకు అభినందనలు తెలిపారు. తహసీల్దార్ రమేష్‌నాయక్‌తో పాటు, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి భూమిపూజ

పట్టణంలోని 4వ వార్డులో మున్సిపల్ పార్కు నిర్మాణానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి భూమిపూజ చేశారు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.60 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నారు. మున్సిపాలిటీలో కాలనీల వారీగా పార్కుల నిర్మాణం కోసం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పసుపుల కృష్ణ, మున్సిపల్ కమిషనర్ రాజయ్యతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీధి నాటకాలను ప్రోత్సహిద్దాం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు

కల్వకుర్తి రూరల్: కళలను కళాకారులను, నాటకాలను ప్రోత్సహిద్దామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలంలోని తాండ్రకి చెందిన ఆదిచింతల మునిరంగస్వామి నాటక ప్రదర్శనకు ఐక్యతా చైర్మన్ రూ.20 వేల ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. అల్లాజీ, సుల్తాన్, శ్రీనివాసులు, చిట్టయ్య, తాండ్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కళలను కాపాడుకోవాలి

వెల్దండ: మండల పరిధిలోని రాచూర్‌లో నిర్వహిస్తున్న శివగంగ కల్యాణం నాటకానికి ఆదివారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పురాతనం నుంచి వస్తున్న సాంప్రదాయ కళాకారులను ఆదుకోవాలన్నారు. వారికి ఆర్థిక సాయం అందించి వీధినాటకాలను కాపాడుకోవాలన్నారు. పురాతన చరిత్రలను భవిష్యత్ తరాలకు వివరించాలన్నారు. వెంకట్రాములు, శ్రీశైలం, యాదయ్య, మల్లేష్‌ముదిరాజ్, జయరాం, రాజు, లక్ష్మయ్య, కృష్ణయ్య, శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న చేస్తున్న ఎమ్మెల్యే మర్రి

కందనూలు: పట్టణంలోని నూతన వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.3.44 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్ముకునేలా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ నిధులతో మార్కెట్ ముఖ ద్వారం, సెక్యూరిటీ రూమ్స్, ఓపెన్ ప్లాట్‌ఫాం, మార్కెట్ యార్డులో చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుర్మయ్య, బైకని శ్రీనివాస్ యాదవ్, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

దళితుల అభివృద్ధిలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న

చారకొండ: దళిత వాడలు నేటికీ అభివృద్ధి చెందలేవని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పెంట్లవెల్లిలో ప్రారంభమైన బైక్ ర్యాలీ ఆదివారం చారకొండ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాశన్న మాట్లాడారు. దళితుల స్థితిగతులపై అధ్యయనం చేసినట్లు చెప్పారు. అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు దళితులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి, జగన్, అశోక్, పాండు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు



గ్రామస్తులతో సమీక్షిస్తున్న సర్పంచ్, పూజారి

తాడూరు: మండలంలోని సిర్సవాడలో లక్ష్మీనర్సింహస్వామి ఏర్పాట్ల నిమిత్తం సర్పంచ్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన ఆలయ ఆవరణలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించే లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 2 నుంచి ప్రారంభమవుతాయని సర్పంచ్ చెప్పారు. గ్రామస్తులంతా ఐక్యమత్యంతో రాజకీయాలకు అతీతంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించాలని తీర్మానించారు. ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, ఆలయ పూజారి జగదీశ్వరాచారితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశ్రమానికి పరుపుల వితరణ



పరుపులు అందజేస్తున్న దాతలు

కందనూలు: జ్ఞాన వికాస భారతి క్రీడా సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కొల్లాపూర్ చౌరస్తాలోని జ్ఞాన సరస్వతి దేవాలయంలో నిర్వహిస్తున్న బాల కల్యాణ ఆశ్రమం చిన్నారుల సేవార్థం 11 పరుపులను అందజేసినట్లు సంస్థ ఉపాధ్యక్షుడు సోమ ప్రగతి గౌడ్, ప్రధాన కార్యదర్శి గన్నోజు సుధారాణి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన దాత కల్యాణ్ కర్, ఉమాదేవి, వినోద్ సహకారంతో అందజేసిన పరుపులను విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో ఆశ్రమ అధ్యక్షుడు దొడ్ల నారాయణరెడ్డికి అందజేశారు. అనాథ పిల్లలకు సేవ చేయడం మహా భాగ్యమన్నారు. బ్రహ్మచారి, ఉమాదేవి, శిరీష, రాధిక, ప్రమీల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు.

మహనీయుల శోభాయాత్ర



శోభాయాత్రలో బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: దేశంలోని మెజార్టీ ప్రజలకు అక్షరాన్ని, ఆస్తిని, ఆయుధాన్ని హక్కుగా ఇచ్చిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే, బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతుల సందర్భంగా బీఎస్పీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ పురవీధుల వెంట ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. దేశ ప్రజలంతా కొనియాడదగిన మహనీయులు పూలే, అంబేడ్కర్‌లని అన్నారు. పూలే, అంబేడ్కర్‌లను ఒక వర్గానికో, ఒక కులానికో పరిమితం చేయడం తగదన్నారు. మహనీయుల ఆశయాలను రాజ్యాధికారం వైపు మళ్లించడమే బహుజన యువత లక్ష్యం కావాలని పలువురు పిలుపునిచ్చారు. బహుజనులకు 125 అడుగుల విగ్రహాలు, స్మృతి వనాలు, పార్కులు అవసరమే కానీ రాజ్యాధికారం అత్యవసరమన్నారు. బీఎస్పీ నాగర్‌కర్నూల్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్, నాయకులు రాంచందర్, పృథ్వీరాజ్, మహేశ్ యాదవ్, పరశురాం, ఆనంద్, కళ్యాణ్, శివశంకర్, లక్ష్మణ్, రాంచందర్, మోహన్ రెడ్డి, నాగేష్, శివకృష్ణ, బాలరాజు పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కలు చోరీ : కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని మొల్గర గ్రామ నర్సరీలో ఎలాంటి అనుమతి లేకుండా శనివారం ఈత మొక్కలను దొంగలించాడని పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఆదివారం నిందితుడు పెద్దాపూర్‌కు చెందిన వంగ సాయిబాబుగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. ఒక్కో మొక్క రూ.60ల చొప్పున మొత్తం 400ల మొక్కలకు రూ.24,000 విలువ ఉంటుందన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి రూరల్: మండలంలోని జిల్లెల్లకి చెందిన జంగయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఆదివారం ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమకూర్చిన రూ.5 వేలను ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబానికి అందజేశారు. రవి, మహేశ్, హరీశ్, శ్రీహరి, మల్లయ్య పాల్గొన్నారు.

రూ.10 వేల సాయం

పెద్దకొత్తపల్లి: వెనచర్లకి చెందిన బండారి శివమ్మ అనే మహిళ అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రవికుమార్, ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డి, బాలస్వామి, పర్వతాలు పాల్గొన్నారు.

బాధితుడికి చేయూత



కల్వకుర్తి రూరల్: పట్టణంలోని బలరాం నగర్‌కు చెందిన నవీన్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధితుడు నవీన్‌కు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. మిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి చెప్పారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మర్రి పరామర్శ

తెలకపల్లి: నాగర్‌కర్నూల్ బస్‌డిపో సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తెలకపల్లికి చెందిన మల్లేష్ శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తెలకపల్లిలోని మృతుడి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన జంగిలి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం సర్పంచ్ భూపతిరెడ్డి, ఉపసర్పంచ్ నిరంజన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ జిల్లా నాయకులు శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ముగ్గురు ఆడ పిల్లలు కావడంతో వారి చదువులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

'చలో అచ్చంపేట'కు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



లింగాల: మన్ననూర్ గురుకుల పాఠశాలలో మృతిచెందిన నిఖిత మృతికి నిరసనగా ఆదివారం అచ్చంపేటలో అఖిల పక్షం చేపట్టిన నిరసనలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

నా జీవితం ప్రజాసేవకే అంకితం

- ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

బల్మూర్: నా జీవితాన్ని నల్లమల ప్రాంత ప్రజల కోసమే అంకితమిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జినుకుంట కనకాల మైసమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నల్లమల ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి త్వరలోనే ఉమామహేశ్వర, చెన్నకేశవ రిజర్వాయర్ల కోసం సీఎం కేసీఆర్‌తో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అలాగే అచ్చంపేటలో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభిస్తామని చెప్పారు. ఆపదలోని ప్రతిఒక్కరిని ఆదుకుంటామన్నారు. మనోహర్, అరుణ, భీమమ్మ, లక్ష్మమ్మ, ప్రతాప్‌రెడ్డి, రాంబాబునాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పరిపల్లిలో రెండు రోజుల కిందట గుండెపోటుతో మృతిచెందిన దేవేందర్‌గౌడ్ కుటుంబాన్ని ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పరామర్శించారు. పిల్లల చదువుల కోసం తాను సాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కందుకూరి జీవితం ఆదర్శప్రాయం



నివాళి అర్పిస్తున్న నాయకులు

కొల్లాపూర్: కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలను ఆదివారం కొల్లాపూర్‌లో నిర్వహించారు. వీరేశలింగం పంతులు చిత్రపటానికి ఎస్ఎల్‌వీఆర్‌డీఎస్ సంస్థ నిర్వాహకులు కట్టా శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ నాయకులు గడ్డం శేఖర్ యాదవ్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సదర్భంగా వారు మాట్లాడారు. సమానత్వం, సతీ సహగమన నిషేధం, వితంతు వివాహాలు, మహిళలకు విద్య వంటి అంశాలపై అవిశ్రాంత పోరాటం చేసిన వారిలో వీరేశలింగం ఒకరన్నారు. ఆయన జీవితం ఆదర్శప్రాయమన్నారు.

బీజేపీ సంస్థాగతంగా అభివృద్ధి చెందేలా కృషి



మాట్లాడుతున్న సుధాకర్‌జి

అమ్రాబాద్: బీజేపీ సంస్థాగతంగా అభివృద్ధి చెందేలా ప్రతికార్యకర్త పాటుపడాలని బూత్ స్వశక్తి పాలమూరు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సుధాకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం అమ్రాబాద్, పదరలో పర్యటించి మండల స్థాయి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలని సూచించారు. బూత్ స్వశక్తి సంఘాల నాయకులు ప్రతి ఇటికి తిరిగి కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, సీనియర్ నాయకులు దేవని సతీష్‌మాదిగ, మంగ్యానాయక్, మండికారి బాలాజీ, పోకలకారి రామోజి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మండికారి బాలాజీ

అమ్రాబాద్: కేంద్ర సామాజిక న్యాయశాఖ సాధికారిక మంత్రి వీరేంద్రకుమార్ ఈ నెల 20న అమ్రాబాద్ మండలం మన్ననూర్ మీదుగా శ్రీశైలం వెళ్తున్నారని మల్లికార్జున స్వామి దర్శనం అనంతరం, అక్కడ బహిరంగ సభ ఉంటుందని ఆల్‌ఇండియా ఫెడరేషన్ కార్యదర్శి మండికారి బాలాజీ వివరంచారు. మంత్రి పర్యటన విజయవంతం చేయాలని కోరుతూ.. ఆదివారం మండల కేంద్రం పదరలో ఆరెకటికలను కలిసి వివరించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ నరేష్ నాయక్

చారకొండ: మండలంలోని మర్రిపల్లి తండా పంచాయతీ పరిధిలోని బోడబండ తండాలో రూ.10 లక్షలతో ఆదివారం సర్పంచ్ నరేష్ నాయక్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామంలో ఇప్పటికే రూ.70 లక్షలతో సీసీ రోడ్డు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని సర్పంచ్ అన్నారు. పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, మల్లేష్ నాయక్, మోతిలాల్, తావు నాయక్ పాల్గొన్నారు.

కొట్రలో ముస్లింలకు ఇఫ్తార్



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు

వెల్దండ: మండల పరిధిలోని కొట్రలో ముస్లింలకు ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకలు అన్నారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. అబ్దుల్, రహీం సాబ్, బషీరుద్దీన్, నజీరొద్దీన్, మైబెల్లి, రావుఫ్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం..

వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్‌లో అంబేడ్కర్ జయంతి సందర్భంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆదివారంతో టోర్నీ ముగిసింది. గెలుపొందిన జట్లకు ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి బహుతులు అందజేశారు. మొదటి విజేతగా నిలిచిన కల్వకుర్తి జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.30 వేల నగదు, రెండో విజేతగా నిలిచిన పెద్దాపూర్ జట్టుకు జ్ఞాపికతో పాటు రూ.18 వేల నగదు అందజేశారు. జయంత్‌రెడ్డి, యాదగిరి, సుఖ్‌జీవన్‌రెడ్డి, యాదయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

కందనూలు: అదుపు తప్పి డీసీఎంను ఢీ కొట్టిన ద్విచక్ర వాహనదారుడికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపం నల్లవాగు బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిమ్మాజిపేట మండలం అప్పాజిపల్లికి చెందిన సుందరయ్య, బాలస్వామి అన్నదమ్ములు. ఇద్దరు సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై జిల్లా కేంద్రానికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. ఉయ్యాలవాడ సమీపంలోని నల్లవాగు వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న డీసీఎంను ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో సుందరయ్యకు స్వల్ప గాయాలు కాగా, బాలస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. బాలస్వామిని వెంటనే మెరుగైన వైద్యం నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.